అప్పన్నను దర్శించుకున్న శ్రీరంగం పీఠాధిపతి

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారిని శ్రీరంగంలోని శ్రీమద్ ఆండవన్ శ్రీ పౌండరీకపురం స్వామి ఆశ్రమం, శ్రీరంగం పీఠాధిపతి స్వామీజీ దర్శించుకున్నారు. వీరికి ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, వేద పండితులు, పర్యవేక్షణాధికారి కె.వెంకటేశ్వరావు పూల మాలలు వేసి పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. స్వామీజీ కప్ప స్తంభం ఆలింగనం చేసుకుని, బేడా ప్రదక్షిణ చేసి స్వామివారికి సంకల్పం చెప్పించారు. పిదప వేద పండితులు ఆశీర్వచనం పలికారు.

అక్రమ బియ్యం గుర్తించడానికి
మొబైల్ రాపిడ్ కిట్లు

బియ్యం అక్రమ రవాణా తనిఖీకి మూడు చెక్ పోస్టులు → మంత్రి నాదెండ్ల

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: బియ్యం తీసుకొచ్చే వాహనాలను నిరంతరం తనిఖీ చేయదానికి విశాఖపట్నం పోర్టు ప్రాంతంలో మూడు అంతర్గత చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఆహారం, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. సోమవారం ఉదయం స్థానిక సర్క్యూట్ హౌస్‌లో మంత్రి మనోహర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ గాజువాక గేట్ వే సి.ఎఫ్.ఎస్. షీలా నగర్ వద్ద, శ్రవణ్ సి.ఎఫ్.ఎస్. షీలా నగర్ వద్ద, బిపిఎల్ ఇంటిగ్రల్ సి.ఎఫ్.ఎస్. పెదగంట్యాడలలో మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా నాణ్యమైన పోర్టిఫైడ్ రైస్ ప్రజలకు అందిస్తుందని, ప్రభుత్వం అందించే బియ్యం పక్కదారి పట్టకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పిడిఎస్ బియ్యం గుర్తించడానికి 700 మొబైల్ రాపిడ్ కిట్స్ అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. రాష్ట్రంలో 4 కోట్ల 42 లక్షల మందికి క్యూఆర్ కోడ్ కలిగిన స్మార్ట్ రైస్ కార్డులు అందించడం జరిగిందని, 89% మంది వీటి ద్వారా రైస్ తీసుకుంటున్నారని తెలుస్తుందన్నారు. వినియోగదారులకు బియ్యం సంబంధించిన సమస్యలు ఉంటే 1967 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. రాపిడ్ కిట్‌తో పిడిఎఫ్ బియ్యం గుర్తించే విధానాన్ని కమిషనర్ సౌరబ్ గౌర్ విలేకరులకు వివరించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల సంస్థ ఎండి మన్జీర్ జిలాని, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, పౌరసరఫరాల సంస్థ డిఎం శ్రీలత, జిల్లా పౌర సరఫరాల అధికారి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్య సేవలు
కొనసాగించండి

సిపిఐ నిరసన

విశాలాంధ్ర - విశాఖ: ఎన్టీఆర్ వైద్య సేవలను కొనసాగించాలని సిపిఐ డిమాండ్ చేసింది. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం జరిగింది. సిపిఐ సహాయ కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్

మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడు నెలలుగా బకాయిలు చెల్లించలేదన్న నెపంతో కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రులు శుక్రవారం నుండి ఎన్టీఆర్ వైద్య సేవలు అందించడం లేదని అన్నారు. దీనివల్ల పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. విశాఖ జిల్లాలో 62 ఆసుపత్రులు ఎన్టీఆర్ వైద్య సేవలు అందిస్తుండగా 27 ఆసుపత్రులు వైద్య సేవలను నిలిపివేశాయని తెలిపారు. ఆస్పత్రులకు డబ్బులు చెల్లించి వైద్య సేవలు కొనసాగేలా చూడాలని కోరారు. వైద్యం ప్రాథమిక హక్కు అని, దీన్ని కాపాడడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని అన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు చెల్లించే డబ్బులతో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆసుపత్రులు నిర్మించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెయ్యల నాగభూషణరావు, మన్మధరావు, క్షేత్రపాల్ రెడ్డి, జిల్లా సమితి సభ్యులు సిహెచ్. కాసుబాబు, మహిళా సమాఖ్య నాయకులు పుష్పలత, మత్స్య కార్మిక సంఘం నాయకులు వజ్రం, మీసాల శ్రీనివాస్, మత్స్య కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వాసుపల్లి నల్లయ్య, ఆరిలోవ పార్టీ శాఖ కార్యదర్శి లక్ష్మణరావు, అత్తిలి రవి తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షించుకుందాం..

విశాలాంధ్ర - భీమిలి: మండలంలోని గొల్లలపాలెం గ్రామంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఆడపిల్లలను రక్షించండి అనే ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యూపీహెచ్ఎస్ డా. కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ చాలా మంది ఆడపిల్లలు చదువుకోలేకపోవడం వల్ల చిన్న వయస్సులోనే పెళ్ళిళ్ల చేసేస్తున్నారని, మహిళలకు ఉన్న హక్కుల గురించి మాట్లాడితే వేధిస్తున్నారని, ఆత్మస్థైర్యంతో వాటిని అధిగమించుకుంటూ ముందుకు వెళ్లాలంటే ప్రతీ అమ్మాయి చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ బి.నాగమణి, డబ్ల్యుహెచ్ఎస్ కె.లావణ్య, గొల్లలపాలెం ఆశావర్కర్ ఎన్.నాగమణి, ప్రిన్సిపాల్ గంగా కుమారి పాల్గొన్నారు.

కల్తీ మద్యం విక్రయాలపై
సీబీఐ విచారణ జరిపించాలి

వైసీపీ జిల్లా అధ్యక్షులు కె.కె.రాజు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: కల్తీ మద్యం విక్రయాలపై సీబీఐ విచారణ జరిపించాలని జిల్లా వైసీపీ అధ్యక్షులు కేకే రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉత్తర నియోజకవర్గం బిర్లా జంక్షన్ నుండి మాధవదారలో ఉన్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి కమిషనర్‌కి వినతిపత్రం అందజేశారు. ముందుగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నకిలీ మద్యాన్ని ఒక కుటీర పరిశ్రమగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో తయారుచేసి ప్రజల ప్రాణాలని హరిస్తోందని ధ్వజమెత్తారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం పాలసీ పారదర్శకంగా ఉండాలని ఉద్దేశంతో వై.యస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ రంగంలో అబ్కారీ కొనసాగించి దఫా దఫాలుగా మద్యం షాపులను నియంత్రించే విధంగా చర్యలు తీసుకొచ్చారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే కల్తి మద్యానికి సంబంధించి సిబిఐతో విచారణ చేయాలని, వారిని వెంటనే అరెస్టు చేసి ఈ రాష్ట్రంలో ఉన్న 75వేలకు పైగా ఉన్న బెల్ట్ షాపులను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ సాడి పద్మారెడ్డి, కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్ రాజు, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, కె.వి.యస్.శశికళ, రాష్ట్ర ఎస్.ఇ.సి మెంబర్లు సతీష్ వర్మ, వైసీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు, వైసీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి పాల్గొన్నారు.

మెడికల్ కాంట్రాక్టు వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ఏఐటీయూసీ రాష్ట్రసమితి సభ్యురాలు భవాని

విశాలాంధ్ర - పెందుర్తి : విశాఖ జిల్లా వ్యాప్తంగా జిల్లా, ఏరియా కమ్యూనిటీ హెల్త్, అర్బన్ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న మెడికల్ కాంట్రాక్టు వర్కర్ల సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్రసమితి సభ్యురాలు భవాని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పెందుర్తి ఆసుపత్రి డిసిహెచ్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు నమ్మి లక్ష్మి, కె. లక్ష్మి మాట్లాడుతూ శానిటేషన్ కార్మికుల శ్రమ దోచుకొని జీతాలు, పిఎఫ్, ఈఎస్ఐ డబ్బులు దోచుకున్న టీవీటీ కంపెనీ కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని వారిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. శానిటేషన్ సెక్యూరిటీ పెస్ట్ కంట్రోల్ విభాగాలలో నూతనంగా వచ్చిన కాంట్రాక్టర్ల కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని కోరారు. అలాగే 138వ జీవో ప్రకారం మార్గదర్శకాలు తయారుచేసి కార్మికులకు నష్టం కలిగించేలా టెండర్లు వేశారని, కార్మికులకు 50 సంవత్సరాల వరకే ఉపయోగపరిమితి పెట్టారని, దాదాపు ఈ రంగాలలో కార్మికులు 20 ఏళ్ల నుంచి పని చేస్తున్నారని, వారిని 50 సంవత్సరాల పేరుతో తొలగించడం దుర్మార్గమని తెలిపారు. ఈ సమస్యలు తక్షణం పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మికులు ఆకుల భవాని, గణేష్, మహేష్, లక్ష్మి, గురమ్మ, కుమారితో పాటు జిల్లాలో వివిధ ఆసుపత్రి కార్మికులు పాల్గొన్నారు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బౌద్ధ స్వీకార దినోత్సవం విజయవంతం చేయండి

కొత్తపల్లి వెంకటరమణ పిలుపు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బౌద్ధ స్వీకార దినోత్సవం సందర్భంగా తథాగత గౌతమ బుద్ధ ధ్యాన వనంలో కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 14న ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కమిటీ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్ అండ్ బి,పాస్ పోర్ట్ ఆఫీస్ దగ్గర గల రైతుబజార్ ఎదురుగా ఉన్న ఈ ధ్యాన వనంలో జరగబోవు కార్యక్రమాన్ని బుద్ధిష్టులు,దళిత బహుజన, ప్రజాసంఘాలు ప్రతినిధులు విజయవంతం చేయాలని కోరారు.

కార్యక్రమానికి ముందు ఉదయం 10 గంటలకు ఎన్ఏడి జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహం నుండి కార్యక్రమ వేదిక వరకు శాంతి ర్యాలీ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా బుద్ధిస్ట్ మాంక్ బంతేజీ అనలియో, మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతున్నారని చెప్పారు. హిందువుగా పుట్టాను గాని హిందువుగా మరణించనని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రకటించారని దానికి అనుగుణంగా నాగపూర్ లో 1956 అక్టోబర్ 14న 4 లక్షల మందితో బుద్ధిజాన్ని స్వీకరించారని చెప్పారు.

బి.ఆర్.టి.ఎస్ రోడ్డు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయండి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: అడవివరం నుండి దారపాలెం బిఆర్.టి.ఎస్ రోడ్డులో పెండింగ్లో ఉన్న రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన 8వ జోన్ పరిధిలో అడివి వరం నుండి దారపాలెం వెళ్లే బి.ఆర్.టి.ఎస్ రోడ్డులో (ఎస్.టి.సి - సింహాచలం ట్రాన్సిట్ కారిడార్) పెండింగ్లో ఉన్న రోడ్డు విస్తరణ పనులను జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పివివి సత్యనారాయణ రాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ నవంబర్ నెలలో అంతర్జాతీయ భాగస్వామ్య సదస్సు విశాఖ వేదికగా జరుగుతున్నందున నగర సుందరీకరణ, రోడ్ల అభివృద్ధి, విస్తరణ పనులు వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అందులో భాగంగా అడవివరం నుండి దారపాలెం వెళ్లే బిఆర్‌టిఎస్ రోడ్డులో ఎడమవైపున 350 మీటర్ల పెండింగ్‌లో ఉన్న రోడ్డు (ఎస్.టి.సి - సింహాచలం ట్రాన్సిట్ కారిడార్)విస్తరణ పనులను వేగవంతం చేయాలని జీవీఎంసీ ప్రధాన ఇంజనీరును ఆదేశించారు. రోడ్డు విస్తరణలో సింహాచలం ట్రాన్సిట్ క్యారిడార్‌లోని ఆస్తులు కోల్పోయిన 27 ఆస్తులకు సంబంధించి స్థలాలను రోడ్డు మ్యాప్ ద్వారా పరిశీలించి సంబంధిత ఆస్తులకు టిడిఆర్‌లు జారీ ప్రక్రియకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జీవీఎంసీ అసిస్టెంట్ సిటీ ప్లానర్ రామలింగేశ్వర్ రెడ్డిని ఆదేశించారు.

ఈ పర్యటనలో పర్యవేక్షక ఇంజనీరు కె.శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్ హెచ్. శంకర్రావు, కార్యనిర్వాహక ఇంజనీరు దిలీప్, ఉప కార్యనిర్వహక ఇంజనీరు ప్రవీణ్, సచివాలయం వార్డు ఎమినిటీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

విశాలాంధ్ర - భీమిలి: తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కాలేజీలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. అవంతి విద్యాసంస్థల చైర్మన్ మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలను అందుకోగలమని, అలాగే ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకొని భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్ విద్యార్థులు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆకళింపు చేసుకొని నూతన ఆవిష్కరణలను రూపొందించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆర్జీయూకేటీ-ఐఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని, లక్ష్య సాధనతో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందుకోవాలన్నారు. కార్యక్రమంలో బి.వెంకట రమణ, కొంచాడ కిశోర్, బ్రహ్మకుమారి సిస్టర్ సింధు, అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజెస్ ముత్తంశెట్టి ప్రియాంక, ప్రిన్సిపాల్ డా. బి.మురలీకృష్ణ, డైరెక్టర్ డా. చంద్రశేఖర్, జె.ఆర్.జి. పట్నాయక్ పాల్గొన్నారు.

ప్రజా దర్బార్ వినతులను పరిష్కరించాలి

వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్

విశాలాంధ్ర - విశాఖ: ప్రజా దర్బార్‌కి వచ్చే వినతులను పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ ఆదేశించారు.

సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్ లో ప్రజల నుండి స్వయంగా వెనతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దిష్ట గడువులోగా వినతులను పరిష్కరించాలని అన్నారు. ఎల్ఆర్ఎస్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజా దర్బార్ కి ఆరు ఫిర్యాదులు వచ్చాయి. జాయింట్ కమిషనర్ కె రమేష్, సీఈ వినయ్ కుమార్ పాల్గొన్నారు.

వికసిత భారత్ బిల్డ్ థాన్

విశాలాంధ్ర - ఆనందపురం: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నవతరం విద్యార్థుల వికసిత భారత్ సోమవారం నిర్వహించారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అధ్యక్షులుగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నవతరం విద్యార్థుల వికసిత భారత్ బిల్డ్ థాన్ విజ్ఞాన విహార అటల్ టింకరింగ్ ల్యాబ్ గుడిలోవలో వివిధ విద్యార్థులు వివిధ తరగతుల నుంచి 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అంతర్జాల కార్యశాలలో ఈ పాఠశాల విద్యార్థులు భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన థీములను తయారు చేసి ప్రదర్శించారు. ఇందులో ఆత్మనిర్భర భారత్ స్వదేశీ లోకల్ ఫర్ లోకల్ సమృద్ధి భారత్ వీటిని ఆధారంగా చేసుకుని 15 ప్రదర్శనలు ఉంచారు. శ్రీ సరస్వతి విద్యావిహార విజ్ఞాన విహార సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఈ బిల్డిథాన్ ప్రదర్శన విద్యార్థులలో స్వదేశీ పరిజ్ఞానం పట్ల ఆసక్తిని పెంచి భవిష్యత్ తరాలకు ఆత్మనిర్భర భారత్ పట్ల అవగాహన పెంచుకోవాలని విజ్ఞాన విహార ప్రిన్సిపాల్ తెలిపారు.

జివిఎంసి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"లో 100 వినతులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జీవీఎంసీ లో అన్ని విభాగాలకు కలిపి 100 వినతులు వచ్చాయని జివిఎంసి అదనపు కమిషనరు డి.వి.రమణమూర్తి పేర్కొన్నారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం లోని పాత సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జివిఎంసి అదనపు కమిషనరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 100 అర్జీలు/ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా 1వ జోన్‌కు 01, 2వ జోన్‌కు 13, 3వ జోన్‌కు 14, 4వ జోన్ కు 06, 5వ జోన్‌కు 21, 6వ జోనుకు 12, 7వ జోనుకు 02, 8వ జోన్ కు 18, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 13 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ అకౌంట్సు విభాగమునకు 04, రెవెన్యూ విభాగమునకు 05, ప్రజారోగ్య విభాగమునకు 06, పట్టణ ప్రణాళిక విభాగమునకు 58, ఇంజినీరింగు విభాగమునకు 22, మొక్కల విభాగమునకు 01, యుసిడి విభాగమునకు 04 కలిపి మొత్తంగా 100 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అనంతరం ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ ఫిర్యాదులను అదే రోజు వెంటనే పరిశీలిస్తూ, సంబంధిత ఫిర్యాదు దారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి.నరేష్ కుమార్, ఫైనాన్సర్ అడ్వైజర్ మల్లికాంబ, సిసిపి ఎ.ప్రభాకర రావు, డిసిఆర్ శ్రీనివాసరావు, డిడిహెచ్ ఎం.దామోదర రావు, పర్యవేక్షక ఇంజనీర్లు కె.శ్రీనివాసరావు, సంపత్ కుమార్, గోవిందరావు, శాంతిరాజు, ఏడుకొండలు, డీసీపీలు-హరిదాసు, కె. వెంకటేశ్వరరావు రామ్మోహన్, యుసిడి - పిఒ పి.ప్రసన్నవాణి, డిపిఓ శాంతి కుమారి, ఏసీపీలు, ఆర్ఎఫ్ఒ సిహెచ్.కృపానంద్, సివిఒ డా.ఎల్.రవికుమార్, స్పోర్ట్స్ డైరెక్టర్ అప్పలరాజు, బయాలజిస్ట్ సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



జిమ్‌సర్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవం

విశాలాంధ్ర - మధురవాడ: గీతం ఆసుపత్రి (జిమ్‌సర్) ఆధ్వర్యంలో కీళ్ళనొప్పులపై ప్రజలలో అవగాహన కల్పించడానికి ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. స్థానిక పెదజాలరి పేటలోని సామాజిక వైద్య కేంద్రంతోపాటు గీతం ఆసుపత్రి ఆవరణంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గీతం ఆసుపత్రి ఆర్థోపెడిక్ విభాగం అధిపతి డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో 62.35 మిలియన్ల జనాభా రకరకాల కీళ్ళ వ్యాధులతో బాధ పడుతున్నారని ముఖ్యంగా 45 సంవత్సరాల పైబడిన వారిలో ఈ సమస్య అధికంగా ఉంటుందన్నారు.

ఆర్థరైటిస్ ఎముకలు, వాటి కణజాలాలకు సంబంధించిన సమస్య అని ప్రజలకు వీటి పై సరిఅయిన అవగాహన లేక పోవడం వల్ల వ్యాధి తీవ్రత పెరిగిన తరువాత మాత్రమే వైద్యులను సంప్రదిస్తున్నారని పేర్కొన్నారు. పోషకాహార లోపాలు, ఉబకాయం, కీళ్ళమీద బరువు పడటం, ఒత్తిడి, నిద్రలేమి వంటి వివిధ కారణాల వల్ల కీళ్ళ సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. జిమ్‌సర్ ఆసుపత్రి ద్వారా కీళ్ళ వ్యాధుల చికిత్స, కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్సలకు నవజీవన్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. కాగా ఉచిత వైద్య శిభిరానికి 120 మందికి పైగా రోగులు హజరయ్యారు. కార్యక్రమంలో డాక్టర్ టి.రాజశేఖర్, డాక్టర్ సతీష్‌కుమార్, జిమ్‌సర్ ఆపరేషన్స్ హెడ్ డాక్టర్ బి.కార్తిక్, సీనియర్ వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

muthoot HOUSING FINANCE

ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్ : టిసి నం.14/2074-7, ముత్తూట్ సెంటర్, పున్నెన్‌రోడ్, తిరువనంతపురం-695 034, సిఐఎన్ నం : యు65922కెఎల్2010పిఎల్‌సి025624 కార్పొరేట్ ఆఫీస్ : 12/ఎ 01, 13వ అంతస్తు, పరిణీ క్రెసెంజో, ప్లాట్ నం.సి38 & సి39, బంద్రా కుర్లా కాంప్లెక్స్-జి బ్లాక్ (ఈస్ట్), ముంబై-400051, టెలి నం : 022-62728517, Email Id: authorised.officer@muthoot.com

అనుబంధం-4 [(నిబంధన 8(1)] స్వాధీనత ప్రకటన (స్థిర ఆస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (54 ఆఫ్ 2002) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు- 2002 యొక్క నిబంధన 3 తో చదివే సెక్షన్ 13(12) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి **ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క అధీకృతఅధికారిగా దిగువ సంతకందారు, ఈ కింద ప్రస్తావించిన రుణగ్రహీత(లు) / హామీదారు(లు)లకు డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. డిమాండ్ నోటీసు అందుకున్న తేదీ నుండి 60 రోజుల గడువు పూర్తయిన తర్వాత కూడా రుణగ్రహీత(లు) / హామీదారు(లు) బాకీ మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున పేర్కొన్న నిబంధనల యొక్క నిబంధన 8 తో చదివే చట్టం లోని సెక్షన్ 13 (4) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి, కింద వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకున్నట్లు** రుణగ్రహీత(లు) / హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకానికి నోటీసు ఇవ్వడమైనది.

వ. సం.	ఎల్ఏఎన్/రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు పేరు	డిమాండ్ నోటీసు తేదీ	బకాయి పడిన మొత్తం (రూ.లలో) భవిష్యత్తు వడ్డీ వర్తించును	స్వాధీనత తేదీ
1.	లోన్‌ఎకౌంట్‌నెం.MHFLPROVIS000005011580 1.సప్పగడ్డి కొండాజీ 2.నారాయణమ్మ సప్పగడ్డి	04-జూన్ 2025	03-జూన్-2025 నాటికి రూ.7,45,532.86/-	10-అక్టోబరు -2025
హామీగా పెట్టిన ఆస్తి(లు)/స్థిర ఆస్తి(లు) వివరాలు: పాత డోర్ నం.12-122, డోర్ నం.11-87, అసెస్‌మెంట్ నం.1563, సర్వే నం.225/3, వార్డ్ నం.12, పాత డి.నం.12-122, కొత్త డి.నం. 11-87, బాదాం వీధి, మాడుగుల గ్రామం మరియు గ్రామపంచాయతీ, మాడుగుల మండలం, మాడుగుల ఎస్ఆర్ఓ, అనకాపల్లి జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు 426.5 చదరపు అడుగుల నిర్మిత ప్రదేశంతో ఆర్‌సీసీ పైకప్పు నివాసిత భవనంతోపాటు 116.16 చదరపు గజాల విస్తీర్ణపు భూమి యొక్క ఆస్తి మొత్తంగా. హద్దులు: తూర్పు: నాగిశెట్టి పెంటమ్మ శ్లాబ్ ఇల్లు, పడమర: 6అ॥ల వెడల్పు రోడ్డు, ఉత్తరం: బాదం భీమ్ నాయుడు శ్లాబ్ ఇల్లు, దక్షిణం: 4 అడుగుల వెడల్పు రోడ్డు.				
2.	లోన్ ఎక్కౌంట్ నెం. MHFLPROVIZ000005004967 1. హరిత గాళ్ల 2. గాళ్ల కనకరాజు	04-జూన్ 2025	03-జూన్-2025 నాటికి రూ.9,55,646.96/-	10-అక్టోబరు -2025
హామీగా పెట్టిన ఆస్తి(లు)/స్థిర ఆస్తి(లు) వివరాలు: హామీగా పెట్టిన ఆస్తి(లు)/స్థిర ఆస్తి(లు) వివరాలు: డోర్ నం.3-9, పాత నం.2-285, సర్వే నం.98, పాత అసెస్‌మెంట్ నం.284, కొత్త అసెస్‌మెంట్ నం.285, కొత్తవెలగద గ్రామం మరియు గ్రామ పంచాయతీ, గంట్యాద మండలం, విజయనగరం (వెస్ట్) ఎస్ఆర్ఓ, విజయనగరం, ఆంధ్రప్రదేశ్-535160 నందు 518చదరపు అడుగుల నిర్మిత ప్రదేశంతో ఆర్‌సీసీ పైకప్పు నివాసిత భవనంతోపాటు 65 చదరపు గజాల విస్తీర్ణపు భూమి యొక్క ఆస్తి మొత్తంగా. హద్దులు: తూర్పు: గిడుతూరి అప్పారావు ఇల్లు, పడమర: తలారి సన్నిబాబు ఇల్లు, ఉత్తరం: పంచాయతీ సీసీ రోడ్డు, దక్షిణం: జి పైడితల్లి ఇంటి తర్వాత 3 అ॥ల ఉమ్మడి దారి				

ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నెరపరాదని మరియు ఆస్తితో ఎటువంటి లావాదేవీలైనా పైన వివరించినట్లుగా డిమాండ్ చేసిన మొత్తం మరియు దానిపై భవిష్యత్తు వడ్డీకి గాను **ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** చార్జికి లోబడి ఉండునని ఇందుమూలంగా ప్రత్యేకించి రుణగ్రహీత/లు/హామీదారు/లు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమైనది.

ప్రదేశం: ఆంధ్రప్రదేశ్, తేదీ: 14 అక్టోబరు, 2025 — సం/- అధీకృత అధికారి, ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరపున

నకిలీ మద్యంపై వైసీపీ పోరుబాట

విశాలాంధ్ర - పెందుర్తి: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పెందుర్తి మాజీ శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ ఆధ్వర్యంలో కల్తీ మద్యంపై వైసీపీ శ్రేణులు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టాయి. పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని దుర్గానగర్‌లో ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. సీనియర్ నాయకులతో కలిసి అన్నంరెడ్డి అదీప్ రాజ్ దుర్గానగర్ లో గల ఎక్సైజ్ ప్రొహిబిషన్ స్టేషన్‌లో పెందుర్తి ఎక్సైజ్ ఎస్ఐ జి.శ్రీనివాస్‌రావుకు, నకిలీ మద్యం అరికట్టాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

స్టీల్ సిటీ డిపోను తరలించకుండా చూడాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: స్టీల్ సిటీ డిపో లీజు కాలపరిమితి 33 సం.లు ముగిసినందున, ప్రజా రవాణా ను దృష్టిలో ఉంచుకొని, పాత పద్ధతిలోనే లీజు కాలపరిమితి పొడిగించి డిపోని తరలించకుండా చూడాలని సోమవారం విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌ని కలిసి ఏపీ జెఏసి అమరావతి జిల్లా చైర్మన్ ఎస్. నాగేశ్వర రెడ్డి ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ స్టీల్ సిటి డిపో నాయకులతో కలసి విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యస్.నాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ స్టీల్ సిటీ డిపో ద్వారా స్టీల్ ప్లాంట్ ఉద్యోగులకు, ఇతర పరిశ్రమలలో పనిచేసే ఉద్యోగులకు, విద్యార్థులకు, వ్యాపారస్థులకు అందిస్తున్న సేవలు, డిపో ఎత్తి వేస్తే, ప్రయాణానికి చాలా ఇబ్బందులు ఉంటాయన్నారు. మహిళల ఫ్రీ టికెట్ మీద చాలా ఎక్కువ మంది ప్రయాణిస్తు ఉన్నారు. డిపో ఎత్తివేస్తే వీరంతా ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులకు గురై, ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈవిషయాన్ని పరిశీలించి, ప్రజా రవాణా కాపాడేందుకు, స్టీల్ యాజమాన్యంతో మాట్లాడి, సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. అవకాశం ఉన్నంతవరకు స్టీల్ సిటీ డిపో ను అక్కడే ఉండేలా చూడాలని హామి ఇచ్చారని ఆర్టీసి ఇ.యు జోనల్ అధ్యక్షులు, ఏపిజేఏసి అమరావతి విశాఖజిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిజేఏసి అమరావతి జిల్లా కో చైర్మన్ యస్.ఏ. త్రినాథ్, ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కె.యస్.యస్.మూర్తి, జి.తాతాలు,స్వామి, స్టీల్ సిటీ డిపో ప్రెసిడెంట్ కె.యస్. ప్రకాష్, సెక్రటరీ బిందారు రాము, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గూగుల్ డేటా సెంటర్‌కు భూములిచ్చేది లేదు

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి నియోజకవర్గం ఆనందపురం మండలం తర్లువాడ పంచాయతీ పరిధిలో తర్లువాడ గ్రామపంచాయతీ ఎస్సీ కాలనీ సంబంధించిన రైతులు గూగుల్ డేటా సెంటర్‌కు తమ భూములను ఇచ్చేదే లేదని భీమిలి ఆర్డిఓ ఆఫీస్ దగ్గర ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 1971లో ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్న టైంలో తరలివడ ఎస్సీ కాలనీకి చెందిన పేద దళిత రైతులకు కుటుంబానికి రెండు ఎకరాలు చొప్పున ఇవ్వడం

జరిగిందని, అప్పటినుండి సేంద్రీయ వంటలు పండించుకుంటూ జీవనాధారంగా చేసుకుంటూ బ్రతుకుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గూగుల్ డేటా సెంటర్ తరలివాడ ప్రాంతంలో బలవంతంగా భూసేకరణ చేసి ఎస్సీ కాలనీ రైతుల దగ్గర సుమారు 200 ఎకరాలు లాక్కోవాలని చూస్తున్నారని అన్నారు. సిపిఎం పార్టీ భీమిలి కార్యదర్శి ఆర్ ఎస్ ఎన్ మూర్తి మాట్లాడుతూ తర్లు వాడ ప్రాంతంలో గూగుల్ డేటా సెంటర్ వస్తే ఆ ప్రాంతం పొల్యూషన్ అవుతుందని డేటా సెంటర్ నుంచి వచ్చిన రేడియేషన్ వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ భీమిలి జోన్ సహాయ కార్యదర్శి ఎస్ అప్పలనాయుడు, సిఐటియు మండల అధ్యక్షులు నేలత్ రాము, నర్సింగు, గణేష్, కొండమ్మ పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీ సిపిఆర్ అవగాహన వారోత్సవం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రాణాలను రక్షించే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, సిపిఆర్ అవగాహన అందరికీ అవసరమని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సహకారంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, విశాఖ బ్రాంచ్, అక్టోబర్ 13 నుండి 17, 2025 వరకు సిపిఆర్ అవగాహన వారోత్సవ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆర్‌కె బీచ్‌లో జరిగింది. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రాణాలను రక్షించే నైపుణ్యాలపై శిక్షణ అవసరమన్నారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకరత బాగ్చి మాట్లాడుతూ కార్డియోపల్మనరీ రససిటేషన్ (సి పి ఆర్) యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేస్తూ, గుండె ఆగిపోయినప్పుడు మెదడు, ముఖ్యమైన అవయవాలకు రక్త ప్రసరణ సహాయపడి ప్రాణాలను రక్షించే సాంకేతికత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సి.బాలసతీష్, ట్రైనర్ రహమతుల్లా, వైస్ చైర్మన్ మురళీ కృష్ణ పట్నాయక్, ప్రథమ చికిత్స ట్రైనర్ డాక్టర్ పి.రామారావు, మురళీ కృష్ణ పట్నాయక్ పాల్గొన్నారు.

మతి స్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



విశాలాంధ్ర - పద్మనాభం: దాసరి శ్రీనివాస్ (62) అనే వ్యక్తి ఆచూకీ కనిపించడం లేదని దాసరి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు భీమిలి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వడం జరిగింది. భీమిలిలో కోటవీధి రొట్టెల వీధిలో నివాసముంటున్న దాసరి శ్రీనివాస్ కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో అక్టోబర్ 12వ తారీకు ఆదివారం నుండి శ్రీనివాస్ కనిపించడం లేదని అతని భార్య, కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలంతా వెతికిన కనిపించకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇచ్చారు. పోలీసు వారు ఫిర్యాదును నమోదు చేయగా దర్యాప్తు నిమిత్తం ఈ కేసును హెడ్ కానిస్టేబుల్ బి ప్రసాద్ రావుకు అప్పగించారు. శ్రీనివాసరావు కనబడకుండా పోయిన రోజున లేత గులాబీ రంగు షర్టు, గళ్ళ షార్ట్ తో ఉన్నట్లు సుమారు 5 అడుగుల 11 అంగుళాలు ఉంటాడని చామన చాయ రంగుతో ఉంటాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కేజీహెచ్‌లో సీపీఆర్ అవగాహన వారోత్సవాలు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: దేశవ్యాప్తంగా అధికారికంగా ఈ నెల 17 వరకు సిపిఆర్ అవగాహన వారోత్సవాలు జరుపుకుంటున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆరోగ్య , కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కెజిహెచ్ లో ప్రారంభించింది. దీని ఉద్దేశ్యం కార్డియోపల్మనరీ రీససిటేషన్(సిపిఆర్) అనే ప్రాణరక్షక నైపుణ్యాలపై ప్రజల్లో అవగాహన పెంచడం ,శిక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ఉద్దేశం.ఈ సందర్భంగా కేజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్.కె.వి.యస్.యమ్. సంధ్యా దేవి, అనస్థీషియాలజీ విభాగం ప్రొఫెసర్ , హెడ్ డాక్టర్ .కె.శ్రీలక్ష్మి, ట్రామా , ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ మరియు హెడ్ డాక్టర్ వి.ఎస్.ఎన్. మూర్తి, ఎమర్జెన్సీ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ యస్.నవీన్, స్కిల్ ల్యాబ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్.కె.అపరంజి , స్కిల్ ల్యాబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ రెడ్డి కిరణ్ కుమార్ పర్యవేక్షణలో సీపీఆర్ శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఏఎంసీ, కేజిహెచ్ నర్సింగ్ విద్యార్థులకు , సైకియాట్రీ ఆసుపత్రిలో ఆరోగ్య కార్యకర్తలకు సీపీఆర్ శిక్షణ ఇచ్చారు.

రాబోయే రోజుల్లో ఈ శిక్షణ కార్యక్రమాలు ఐ హాస్పిటల్, ఆంధ్ర విశ్వవిద్యాలయం వంటి వివిధ ప్రాంతాల్లో కొనసాగనున్నాయి. అలాగే అక్టోబర్ 16వ తేదీ (గురువారం) న బీచ్ రోడ్ లో సీపీఆర్ అవేర్నెస్ వాక్ కూడా నిర్వహించనున్నారు.

భీమిలి సాంస్కృతిక పారంపర్యాన్ని మ్యాపింగ్ చేసిన గీతం ఆర్కిటెక్చర్ విద్యార్థులు

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ బీఆర్క్ మరియు ఎంఆర్క్ విద్యార్థులు భీమిలి (భీమినిపట్నం) యొక్క సంపన్న సాంస్కృతిక నిర్మాణాన్ని అర్థం చేసుకోవడం, దాన్ని పూర్ణంగా డాక్యుమెంట్ చేయడం కోసం సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సాంస్కృతిక మాపింగ్ ప్రాజెక్టులో భాగంగా విద్యార్థులు భీమిలి ప్రాచీన తీర నగరపు ప్రత్యేకతను నిర్వచించే అనేక అంశాలను అధ్యయనం చేయడంతో పాటు సర్వేలు నిర్వహించారు. ఈ అధ్యయనం ద్వారా భీమిలి యొక్క నిర్మిత వాతావరణం మరియు సాంస్కృతిక పర్యావరణాన్ని విశ్లేషించారు. ఇందులో సహజ దృష్యాలు, చారిత్రక వికాసం, ఆర్కిటెక్చరల్ టైపాలజీల, సంప్రదాయ పల్లెలు మరియు సముదాయ జీవితం వంటి అంశాలు ఉంటాయి. ఈ అధ్యయనంతో ప్రకృతి, చరిత్ర మరియు మానవ చర్యలు కలిపి ఈ తీర ప్రాంత వారసత్వ పట్టణానికి ఎలా స్వరూపం ఇస్తాయో స్పష్టత ఇవ్వాలని అవగాహనకు వచ్చినట్లు విద్యార్థులు తెలిపారు. బీఆర్క్ విద్యార్థులు నిర్వహించిన స్కెచింగ్ వర్క్‌షాప్ ద్వారా భీమిలి పట్టణంలోని చారిత్రక వైభవాన్ని, ప్రకృతిశోభను వారి స్కెచ్‌బుక్స్ ద్వారా అందించడానికి ఒక గొప్ప అవకాశంగా నిలిచింది. వర్క్‌షాప్ సందర్భంగా విద్యార్థులు భీమిలి యొక్క చారిత్రక వీదుల్లో విహరిస్తూ , అక్కడి డచ్ మరియు కాలనీయ శైలిలో నిర్మిత నర్మాణాలను, చురుకైన తీర ప్రాంతాలను మరియు భూమి -సముద్రాల సజీవ మేళాన్ని స్కెచ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను సుందరమైన వారసత్వ పట్టణంలోని సాంస్కృతిక మరియు నిర్మాణాత్మక మూలాలకు దగ్గరచేసే ప్రేరణాత్మకమైన అనుభవంగా నిలిచిందని గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డీన్ విభూతి సత్యదేవ్ తెలిపారు.

అమేజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2025కి విశేష ఆదరణ

విశాలాంధ్ర - విశాఖపట్నం: సెప్టెంబర్ 22న ప్రారంభమైన ఈ అమేజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2025లో ఆంధ్రప్రదేశ్‌లోని వినియోగదారులు మరియు సెల్లర్స్ ఉత్సాహవంతంగా పాల్గొన్నారని, ఆంధ్రప్రదేశ్ లో విశేష ఆదరణ లభించిందని అమెజాన్ బజార్ ప్రోడక్ట్ బిజినెస్ హెడ్ సమీర్ లాల్వాని తెలిపారు. ఈ మేరకు సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్లు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్ బ్యూటీ, నిత్యావసరాలలో శక్తివంతమైన వృద్ధి కనివించిందన్నారు. అమేజాన్ ఇండియాకు ఆంధ్రప్రదేశ్ నుండి శ్రేణుల్లో విక్రయించే సెల్లర్స్ 23,000 మందికి పైగా ఉన్నారు మరియు మరియు రాష్ట్రంలో అన్ని పిన్ కోడ్స్ కు వేగంగా మరియు సౌకర్యవంతంగా అందచేయడానికి 105కి పైగా డెలివరీ స్టేషన్స్ అమేజాన్ కి ఉన్నాయన్నారు. అక్టోబర్ 6 నుండి కస్టమర్లు అమెజాన్ డాట్ ఇన్ లో "దీపావళి ప్రత్యేకం"తో డీల్స్ మరియు ఆఫర్లను పొందవచ్చు అని, స్మార్ట్ ఫోన్స్ పై 40 శాతం వరకు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్ బ్యూటీ, హోమ్ కిచెన్ %ಡ% అవుట్ డోర్స్ పై 80 శాతం వరకు తగ్గింపు పొందవచ్చు అని చెప్పారు. నిత్యావసరాలపై 70 శాతం వరకు తగ్గింపు పొందవచ్చు అని, టీ వీ లు మరియు గృహోపకరణాలపై 50 శాతం వరకు తగ్గింపును పొందవచ్చు అన్నారు.

అపోలో ఆధ్వర్యంలో 'గ్లోబల్ వాయిసెస్ వన్ విజన్' 2026

విశాలాంధ్ర - విశాఖపట్నం: రోగుల భద్రత, ఆరోగ్య సంరక్షణలో కొత్త ఆవిష్కరణలు, వ్యవస్థల అభివృద్ధిని ప్రోత్సహించే ప్రపంచంలోని ప్రముఖమైన వేదికల్లో ఒకటైన అంతర్జాతీయ ఆరోగ్య సంభాషణ (ఇంటర్నేషనల్ హెల్త్ డైలాగ్స్ ఐ హెచ్డి) 2026 ఎడిషన్‌ను అపోలో హాస్పిటల్స్ నిర్వహించనుంది. ఈ సదస్సు 2026 జనవరి 30 మరియు 31 తేదీలలో హైదరాబాద్‌లో జరగనుంది. ఐహెచ్‌డీ 2026 థీమ్ 'గ్లోబల్ వాయిసెస్ వన్ విజన్' ఈ థీమ్ ఒక ఉమ్మడి లక్ష్యం పట్ల ఉన్న నిబద్ధతను తెలియజేస్తుంది. ఆ లక్ష్యం పటిష్టంగా, రోగి-కేంద్రీకృతంగా, సాంకేతికతతో కూడిన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలను నిర్మించడం. ఈ లక్ష్యాన్ని సాధించడానికి, ప్రపంచం నలుమూలల నుండి వచ్చే ఆలోచనలు, ఆవిష్కరణలు, నాయకత్వాన్ని ఒకే వేదికపైకి తీసుకురావాలని ఈ సదస్సు భావిస్తోంది. ఈ కార్యక్రమం ప్రధానంగా మూడు కీలక అంశాలపై దృష్టి సారిస్తుంది. అవి: నాయకత్వంతో నడిచే భద్రతా నమూనాలు మానవ-కేంద్రీకృత రూపకల్పన, డిజిటల్ పరివర్తనటీ అలాగే ఆసుపత్రి కార్యకలాపాలు, రోగి అనుభవం, చికిత్స ఫలితాలు వంటి అన్ని రంగాలలో అత్యుత్తమ ప్రమాణాలు సాధించే అంశాలపై సదస్సు దృష్టి పెడుతోంది.

అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డా. సంగీత రెడ్డి మాట్లాడుతూ, "ఎన్నో ఏళ్లుగా అంతర్జాతీయ ఆరోగ్య సంభాషణ (ఐ హెచ్ డి) ఒక శక్తివంతమైన ప్రపంచ వేదికగా మారింది. ఇక్కడ వైద్యులు (క్లినిషియన్లు), కొత్త ఆవిష్కరణలు చేసేవారు (ఇన్నోవేటర్లు), విధానాలు రూపొందించేవారు, ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెంచేవారు అంతా ఒకచోట చేరి, ఆరోగ్య సంరక్షణ భవిష్యత్తును రూపొందిస్తున్నారు అని చెప్పారు. హైదరాబాద్‌లో జరిగే ఈ సమావేశం కూడా అదే లక్ష్యంతో ముందుకు సాగుతుంది.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా, డిజిటల్ వ్యవస్థల శక్తిని, సానుభూతి, సహకారం వంటి శాశ్వత విలువలతో జోడిస్తుంది. ముఖ్యంగా, ఆరోగ్య సంరక్షణను మరింతగా ఊహించగలిగేదిగా, నిలకడగా, అందరికీ అందుబాటులో ఉండేలా చేయాలనే ప్రపంచ నిబద్ధతను ఐహెచ్‌డీ ప్రతిబింబిస్తుంది. ఇక్కడ ప్రతి ఆవిష్కరణ సేవ చేయాలి, ప్రతి భాగస్వామ్యం ఆరోగ్యకరమైన ప్రపంచం వైపు నడిపించాలి" అని పేర్కొన్నారు.

భీమిలిలో నకిలీ మద్యంపై వైసీపీ నిరసన

విశాలాంధ్ర - భీమిలి: నకిలీ ఎన్ బ్రాండ్ కల్తీ మద్యం వల్ల ప్రజల ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉన్న వార్డ్ అధ్యక్షులు, మహిళా ఎంపీపీలు, జడ్పీటీసీలు, నాయకత్వం వహించారు. ర్యాలీ భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ కార్యాలయం వద్ద ప్రారంభమై, ఎక్సైజ్ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం ఎక్సైజ్ అధికారులకు భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి, విజయనగరం జిల్లా జిల్లా పరిషత్ చైర్మన్, జిల్లా వైసీపీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉన్న వార్డ్ అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, ముఖ్యనాయకులు వినతిపత్రం అందజేశారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నకిలీ ఎన్ బ్రాండ్ మద్యం సీసాలను పగలగొట్టి పార్టీ మహిళా విభాగం, కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో చిన్న శ్రీను మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి చంద్రబాబు నాయుడు మద్యం బ్రాండ్ అంబాసిడర్‌లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నకిలీ లిక్కర్ వ్యవహారంలో కూడా రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా మార్చే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యం ఘటనలు ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాలు,ఇప్పుడు రాయలసీమలో కూడా పెరుగుతున్నాయని,అయితే విచారణలు నత్తనడకన సాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మరియు జిల్లా, నియోజకవర్గం అనుబంధ విభాగాల మహిళా నాయకులు,వార్డ్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

భాస్కర్ విద్యా నికేతన్‌లో కూరగాయల దినోత్సవం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: 70వ వార్డు చట్టివానిపాలెం భాస్కర్ విద్యా నికేతన్ స్కూల్ నందు కూరగాయలు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కర్‌రావు వివిధ రకాల కాయగూరలు గురించి విద్యార్థులకు వివరించారు. ఏ ఏ కాయకూరల్లో ఏ ఏ విటమిన్లు, ఎటువంటి పోషక విలువలున్నాయో వివరించారు. క్యారట్ నందు విటమిన్ ఏ, ఆకుపచ్చని, వుడికించిన కాయకూరల్లో విటమిన్ సి, చిక్కుడు జాతి కూరగాయల్లో విటమిన్ బి అదేవిధంగా ఇతర కాయగూరల్లో కె విటమిన్ సమృద్ధిగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినులు కె స్వాతి, కె.అపర్ణ, బి.సునీత పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 271 విజ్ఞప్తులు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక "పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్"లో వచ్చిన అర్జీలను పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, పునరావృతం కాని విధంగా సంతృప్తి కరమైన, నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో

"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన అర్జీదారుల సమస్యలను వింటూ, అర్జీలను స్వీకరిస్తూ, సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై మొత్తం 271 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 82 ఉండగా, పోలీసు శాఖకు సంబంధించి 15, జీవీఎంసీ సంబంధించి 86 ఉన్నాయి. అలాగే ఇతర విభాగాలకు సంబంధించి 88 వినతులు వచ్చాయి.

హిందీ ఉపాధ్యాయుని సేవలు ఆదర్శం

విశాలాంధ్ర - భీమిలి: తాటితూరు ఉన్నత పాఠశాలలో గత తొమ్మిది సంవత్సరములుగా హిందీ ఉపాధ్యాయునిగా పనిచేస్తూ వివిధ సేవలు అందిస్తూ రిలీవ్ అవుతున్న సందర్భంగా పాఠశాల తల్లిదండ్రుల కమిటి, పాఠశాల సిబ్బంది టి.ఎస్.వి.ప్రసాదరావును ఘనంగా సత్కరించినట్లు పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు కే.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ బుడుమూరు సోమేశ్వరరావు మాట్లాడుతూ హిందీ ఉపాధ్యాయులుగా గత తొమ్మిది సంవత్సరంల నుండి పనిచేస్తూ తనదైన రీతిలో సేవలు అందిస్తూ పాఠశాలకు హిందీ ఎగ్జామ్ సెంటర్ తీసుకువచ్చి పిల్లలను ప్రవీణా వరకు పంపించేవారని అలాగే భీమిలి మండలంలో మొదటగా తాటితూరు పాఠశాలలో

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ నెలకొల్పి పిల్లలను తృతీయ సోపాన్ పరీక్షలు రాయించి సర్టిఫికెట్స్ అందజేశారని, ఇవి పిల్లల ఉన్నత చదువులకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. సన్మాన గ్రహీత ప్రసాద్ రావు మాట్లాడుతూ ఈ పాఠశాలలో పనిచేయటం నేను చాలా అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, సర్పంచి సిరుగుడి సంతోషి ఈశ్వరరావు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్.ఎస్.టి.ఎల్‌లో డి.ఆర్.డి.ఓ సెంట్రల్ జోన్ ఫుట్‌బాల్ టోర్నీ

విశాలాంధ్ర- సింహాచలం: గ్రేటర్ విశాఖ స్థానిక ఎన్.ఎస్.టి.ఎల్‌లో డి.ఆర్.డి.ఓ సెంట్రల్ జోన్ ఫుట్బాల్ టోర్నమెంట్ 2025-26 ఘనంగా ప్రారంభం అయ్యింది.డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్ ప్రధాన నావికా పరిశోధన ప్రయోగశాల అయిన విశాఖపట్నంలోని నావల్ సైన్స్ టెక్నలాజికల్ లాబొరేటరీ ఈనెల అక్టోబర్ 13 నుండి 17 వరకు సెంట్రల్ జోన్ ఫుట్బాల్ టోర్నమెంట్ 2025-26ని నిర్వహిస్తోంది. డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ సమక్షంలో విశిష్ట శాస్త్రవేత్త, డైరెక్టర్ జనరల్ (నేవల్ సిస్టమ్స్ మెటీరియల్స్) డాక్టర్ ఆర్.వి.హరప్రసాద్ ముఖ్య అతిథిగా జ్యోతి ప్రజ్వలన చేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఐదురోజుల లీగ్-కమ్-నాకౌట్ టోర్నమెంట్లో 150 మంది ఆటగాళ్లతో 08 జట్లు పాల్గొంటున్నాయని శాస్త్రవేత్త 'ఎఫ్' నిర్వాహక కమిటీ చైర్మన్ కె.రాజ్‌కుమార్ తెలిపారు.

మారుతి పెట్రోరియా కొత్త కారు లాంచింగ్

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తిలో గల మారుతి షోరూంలో కొత్త మోడల్ విక్టోరియా కారును, పెందుర్తి ఎస్సై భాస్కరరావు, ఆంధ్రప్రదేశ్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షఫీ ఉల్లా చేతుల మీదుగా సోమవారం లాంచింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై భాస్కరరావు కాంగ్రెస్ నాయకుడు మాట్లాడుతూ మారుతి విక్టోరియా కారు మార్కెట్లో ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాంబాబు, హెచ్‌ఆర్ విలియమ్స్, ఆర్ ఎం సన్నీ గౌరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.